తేదీ. 15-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# జగత్తులోని సమస్త పదార్థములు, ప్రాణులు పరమాత్మ స్వరూపములే!

ఎన్ని విద్యలైన ఏపార చదివిన
పొట్టకూటికెగాని గిట్టబోవు
మట్టిబొమ్మలోని మర్మంబునెరుగని
చదువులన్ని పరము చేర్చగలవా

తత్త్వమడుగంటె సినిమాలు తలకు పట్టె
ఒప్పులన్ని సంఘాన తప్పులయ్యె
యుక్తి కేంద్రాలుగా మారె భక్తియందు
సత్యమును దెల్పుమాట శ్రీ సత్యసాయి మాట

**ప్రేమస్వరూపులారా!**

'సహస్ర శీర్షాః పురుషః సహస్రాక్ష సహస్రపాత్;' అన్ని శిరస్సులు, అన్ని నేత్రములు, అన్ని పాదములు అతనివే! ప్రతి ప్రాణి పరమాత్ముని ప్రతిబింబమే! ఈ ప్రకృతి మాతృస్వరూపిణి. ఈ ప్రపంచమునందు ఏ ఒక్క వస్తువుకూడను పరమాత్ముడు కానిది లేదు. సమస్త పదార్థములు పరమాత్మ స్వరూపములే! 'విశ్వం విష్ణుస్వరూపమ్.' ఈ ప్రపంచము భగవంతుని విశాలమైన వ్యష్టి స్వరూపము. మానవుడు భగవంతుని ప్రకృతి స్వరూపముగా దర్శిస్తూకూడను భగవంతుడు కనిపించలేదని బాధపడుతున్నాడు. భగవంతుని ప్రకృతి స్వరూపము చూచుచూ భగవంతుని చూడలేదని భావించటము యిదే పెద్ద మూఢత్వము. ప్రపంచమునందు అనేక రూపనామములతో కూడిన వస్తువులను చూచుచున్నాడు, మానవుడు. ఇవన్నీకూడను కేవలము భిన్న స్వరూపములుగా విశ్వసిస్తున్నాడు, మానవుడు. కాని సత్య తత్త్వాన్ని గుర్తించుకోటానికి ప్రయత్నించటము లేదు. నిత్యసత్యమైన ప్రకృతిని అసత్యముగా భావించి సత్యమైనది వేరే

sri sathyasai vachanamrutam

యేదియో యీ మిధ్యయందు కలదని విశ్వసిస్తున్నాడు.

**ప్రకృతిలోని సమస్త పదార్థములు భగవంతుని భిన్న స్వరూపములేనని విశ్వసించాలి**

ఈ జగత్తునందు సత్యమైనది ఒకటి, అసత్యమైనది మరొకటి అని రెండు పదార్థములు లేవు. దృష్టి దోషముచేత మానవుడు ఒకే వస్తువును భిన్నత్వముగా దర్శిస్తూ వున్నాడు. ఒక విత్తనము భూమిలో నాటినప్పుడు ఆ విత్తనము తన స్వరూపాన్ని శిధిలము గావించుకొని గొప్ప వృక్షముగా రూపొందుతున్నది. ఈ వృక్షమునందు అనేక కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు వివిధ రూపనామములతో మనకు గోచరిస్తున్నవి. కానీ, 'ఈ భిన్నరూపములకు ఆధారమైన విత్తనము ఒక్కటే', అనే సత్యాన్ని గుర్తించినప్పుడే 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అనే సత్యాన్ని మనము అర్థము చేసుకున్నవారమవుతాము. ఉన్నది ఒక్కటే అయినప్పటికి అనేకమంది అనేకరూపములచేత, అనేక నామములచేత అనుభవిస్తున్నారు.

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతాల విత్రంబులు స**
**న్మిత్రంబులు మునిజనవన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్**

అనింది భాగవతము. సృష్టి విచిత్రంబులు ఎంత విచిత్రమైనవి! వీటిని గుర్తించుకోటం అందరికి సాధ్యము కాదు. ప్రకృతి, పరమాత్మ స్వరూపమనే సత్యాన్ని గుర్తించిన వ్యక్తులు మాత్రమే ఈ సత్యమును కొంతవరకు అర్థము చేసుకోగలరు. 'నేను, నేను' అనే అహంకారము తలలో చేరినంతవరకు, 'నాది, నాది' అనే మమత్వము హృదయములో వుండినంతవరకు, సర్వవ్యాపకమైన సచ్చిదానంద స్వరూపము గుర్తించటానికి వీలుకాదు. ఈ 'నేను, నాది', సర్వము భగవత్ స్వరూపమే, అనే సత్యమును గుర్తించాలి. 'యద్భావం తద్భవతి.' ఎవరెవరి భావములు పురస్కరించుకొని భగవంతుడు ఆయా భావస్వరూపాన్ని అందిస్తూ వుంటాడు. కనుక, ఈ ప్రకృతియందు వున్న సమస్త పదార్థములు కూడను భగవంతుని భిన్న స్వరూపములుగానే మనము విశ్వసించటము అత్యవసరము.

sri sathyasai vachanamrutam

## ప్రకృతి మాతృ స్వరూపిణి .

ఈ ప్రకృతియందు జరిగే సృష్టి స్థితిలయములకుకూడను భగవంతుని శక్తులే ఆధారము. ఇవి యిచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అనే భిన్న రూపములు ధరించి దుర్గ, లక్ష్మి, సరస్వతి అనే స్వరూపములను దర్శింపచేస్తున్నాయి. ప్రకృతి మాతృస్వరూపిణి. ఏ దేశమునందైన కూడను ప్రకృతిని తల్లిగానే భావిస్తూ వుంటారు. ఏ దేశమువారైనాకూడను మాతృదేశము అని చెబుతారుగాని పితృదేశమని చెప్పటం లేదు. కనుక ఈ మాతృతత్త్వమునందు ప్రధానమైనది శక్తి తత్త్వము. మానవునియందు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులను ప్రసరింపచేసేదే శక్తి స్వరూపిణియైన దివ్యత్వము. ఈ సత్యాన్ని నిరూపించటానికి కొన్ని ఉదాహరణములు. ఒకానొక సమయమునందు వ్యాసులవారికి కోపం వచ్చింది. అన్నపూర్ణయైన పార్వతిని కాశీలో దూషించాడు. అప్పుడు ఈశ్వరుడు వ్యాసులవారిని కాశీపట్టణంనుండి తరుమగొట్టాడు. ఈ వియోగముచేత దీక్షనుబూని తానొక నూతనమైన పట్టణమును నిర్మించాడు. గంగను వెళ్లి ప్రార్థించాడు. 'ఈ నూతన పట్టణమునకు చుట్టూ నీవు ప్రవహించాలన్నా'డు. గంగ చెప్పింది, 'వ్యాసా! నీకేమైనా మతి పోయిందా? పార్వతి హృదయాన్ని నొప్పించి గంగను ప్రార్థించినంత మాత్రమున నేను వేరు, పార్వతి వేరు అని భావిస్తున్నావా?' అని. ఈ జగత్తునందు కల సమస్త స్త్రీలు పార్వతి స్వరూపులే! ఆమె యొక్క ప్రతిబింబములే! ప్రకృతియందు పురుషులు, స్త్రీలు, చెట్లు, గుట్టలు క్రిమికీటకాదులు సర్వముకూడను ప్రకృతిమయములేగాని అన్యములు కావు. అయితే, యిక్కడ కొన్ని ముఖ్యమైన ఆదర్శములను మనము గుర్తించాలి.

పాండవాగ్రజుడైన ధర్మజుడు, అర్జునుడు, కృష్ణునకు సన్నిహితులు. వీరు అత్యంత సన్నిహితులు, ప్రేమపాత్రులు. ఒక సమయంలో వారు యెన్ని పర్యాయములు కృష్ణుని ప్రార్థించినప్పటికిని కృష్ణుడు వారి ప్రార్థనను అంగీకరించి ప్రత్యక్షము కాలేదు. ఏ క్షణమునందైనా సరియే ద్రౌపది 'హే! కృష్ణా!' అని ప్రార్థించిన తక్షణమే కృష్ణుడు ప్రత్యక్షమయ్యేవాడు. దీనియొక్క అంతరార్థము యేమిటి? స్త్రీలు ప్రార్థించిన తక్షణమే భగవంతుడు ప్రత్యక్షము కావటము, పురుషులు ప్రార్థించినప్పుడు అతను యేవిధమైన జవాబు యివ్వకుండా వుండటము యిందులో వున్న అంతరార్థము మనము కొంతవరకు ఆలోచించాలి. స్త్రీలు ప్రకృతి స్వరూపులు. వారు ఎల్లవేళలా తాము ప్రకృతినుంచి ఆవిర్భవించినవారమని గుర్తుంచుకుని ప్రకృతికి సంబంధించిన

sri sathyasai vahini

నామమునే వుచ్చరిస్తూ వుంటారు. కాని ప్రకృతియందు ఉద్భవించియు పురుషుడు తాను ప్రకృతికి విరుద్ధమైన పురుషాహంకారముతో విఱ్ఱవీగుతుంటాడు. ఈ అహంకార కారణముచేతనే భగవంతుడు అక్కడ ప్రత్యక్షము కాలేకపోతున్నాడు.

**ధర్మమును ఎవరైనా అనుసరించవలసినదే!**

ప్రతి మానవుడుకూడను ప్రకృతిని అనుసరించక తప్పదు. ఇది ప్రకృతియొక్క ధర్మము. ప్రపంచములో ఏ మానవుడుకూడను ఏ పదార్థమును తన వెంట తీసుకొని రాలేదు. తిరిగి వెళ్లే సమయమందు ఏ పదార్థమును వెంటగొనిపోడు. ఈ విధమైన శాసనము కూటిపేదమొదలు కోటీశ్వరునివరకు సమంగానే అందించినది ప్రకృతి. కూటిపేద ఈ జగత్తును ఏ విధమైన పద్ధతిలో వదలిపోతున్నాడో, కోటీశ్వరుడు అదే స్థితిలో ఈ జగత్తును వదలిపోతున్నాడు. అయితే, మానవునియొక్క మనస్తత్వము దీనికి విరుద్ధముగా గోచరిస్తుండాది. నీరు పల్లమునకు పారటమే దాని స్వభావము. నీటిని ఒక స్థిరమైన పాత్రలో నింపినప్పుడే అటూయిటూ కదలక జలము వుండగలదు. లేకుండిన అది నిరంతరము పల్లమునకే పారుతుంటుంది. అదేవిధముగా మనసు నిరంతరముకూడను ఏదో ఒక విధమైన ఆలోచన చేస్తూనే వుంటుంది. దీనిని భద్రమైన పాత్రలో నింపినప్పుడే అటూయిటూ కదలకుండా నిశ్చలంగా వుండుటకు వీలవుతుంది. మనస్సుకు రెండు విధములైన ప్రవాహములు వుంటున్నవి. ఒకటి కామ సంబంధమైన ప్రవాహము. రెండవది కాంచనము అనగా ధన సంబంధమైన ప్రవాహము. ఈ రెండు ప్రవాహములకు దూరముగా వుండినప్పుడే, మానవుని మానసిక స్థితి ఆధ్యాత్మిక మార్గమును అనుసరిస్తుంది. నిత్యసత్యమైన తత్త్వమును గుర్తించుకొనే నిమిత్తమై పవిత్రమైన చరిత్రను అందించే నిమిత్తమై, సార్థకమైన కర్మలు అందించే నిమిత్తమై, కాలముచే మారక, ప్రళయముచే తరుగక, సృష్టిచే పెరగక ఏ సత్యమైతే వున్నదో ఆ సత్యమునే భారతీయ ధర్మమని వ్యవహరిస్తూ వచ్చారు. ఈ ధర్మమునకు నీతి, నిజాయితీలే సహజమైన స్థానములనికూడను నిరూపిస్తూ వచ్చారు. కనుక, భగవంతుని పొందుటకు నీతి, నిజాయితీలే ముఖ్యమైన మార్గములు.

**మానవుల స్వరూపములు వేరైనా ఆత్మతత్త్వము ఒక్కటే!**

ఈ నీతి, నిజాయితీలుకూడను ప్రకృతిద్వారానే మనకు లభ్యమవుతాయి. జగత్తులో సమస్త

srisathyasaivachanamrutam

పదార్థములు పరమాత్మ స్వరూపములనే మనము విశ్వసించాలి. సర్వప్రాణులు కూడను పరమాత్ముని స్వరూపములుగానే మనము విశ్వసించాలి. అట్లు విశ్వసించిననాడు మనయందు కామక్రోధములుగానీ, రాగద్వేషములుగానీ ఆవిర్భవించుటకు వీలుకాదు. అన్ని పదార్థములు ఒక్కటే అయినప్పుడు దేనిపైన ద్వేషముగాని, రాగముగాని వుండుటకు వీలులేదు. మానవుల రూపనామములు వేరువేరుగా వుండవచ్చు. కాని, నిజతత్త్వము, దివ్యత్వము ఒక్కటే! మానవ స్వరూపములు భిన్నభిన్నముగా కనిపిస్తున్నాయి. కాని, అందరిలోనూ ఆత్మ తత్త్వము ఒక్కటిగానే వుంటుండాది. సముద్రములో అసంఖ్యాకమైన అలలు వుంటాయి. ఒక అల వుండినట్లు మరొక అల మనకు కనిపించదు. ఒక అల అంత్యమవుతూ వుంటుంది, మరొక అల ప్రారంభమవుతుంది. ఎన్ని అలలు లేచినప్పటికిని ఈ అలలు అన్నింటియందు వుండిన జలము ఒక్కటనే సత్యమును జగత్తు మనకు నిరూపిస్తున్నాది. ఈ ప్రకృతియందు ఒక దివ్యమైన శక్తి సర్వవ్యాపకమై వుంటుండాది. అలాంటి ప్రకృతి తత్త్వాన్ని మనము మొట్టమొదట అర్థము చేసుకోవాలి. ప్రకృతిని అర్థము చేసుకొనే నిమిత్తమై మనకు మానవత్వము ప్రాప్తించినదనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. దీనినే వేదాంతము 'నిన్ను నీవు తెలుసుకో'మని ఉపదేశిస్తున్నది. నిన్ను నీవు తెలుసుకొంటివా, జగత్తంతా తెలుసుకున్నవాడవౌతావు.

కనుక, మొట్టమొదట మనము ఈ జగత్తును గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ జగత్తుయందుండిన మహాచైతన్య పురుషుడు ఒక్కడే, అతనే జగదీశుడు. అతనే సత్ చిత్ ఆనందుడు. అన్ని పదార్థములందు అస్తి, భాతి, ప్రియమనేవి సమముగానే వుంటున్నాయి. అనిత్యము, అశాశ్వతము అయిన రూపనామములనే మనము ఆధారము చేసుకొని నిత్యసత్యమైన అస్తి, భాతి, ప్రియములను విస్మరిస్తున్నాము. ఇదియే ఈనాడు మనము పట్టిన పెడమార్గము. మనము యేనాడు సక్రమమైన మార్గములో ప్రవేశించెదమో ఆనాడే సర్వేశ్వరతత్త్వము అర్థము చేసుకున్నవారమవుతాము.

**సర్వజీవులను సర్వేశ్వర స్వరూపులుగా విశ్వసించాలి**

ప్రేమస్వరూపులారా! ప్రకృతియే పరమాత్మ తత్త్వముగా మనము విశ్వసించాలి. పరమాత్ముడు ఎక్కడో వుంటున్నాడనే తత్త్వాన్ని గుర్తించటానికి ప్రయత్నం చేయటం

sri sathyasai vahamrutam

వ్యర్థమవుతుంది. కనుక, సర్వజీవులుకూడను సర్వేశ్వర స్వరూపులుగానే మనము విశ్వసించాలి. ఈ శరన్నవరాత్రులు తొమ్మిది దినములు ఈ పవిత్రమైన ప్రకృతి తత్త్వాన్ని చక్కగా విపులముగా బోధించే నిమిత్తమై యేర్పడినవి. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తియే దుర్గా లక్ష్మీ సరస్వతులు. క్రియాశక్తి అనగా లక్ష్మి, సంపత్తు. సర్వవిధములైన సంపత్తు. సకలైశ్వర్య స్వరూపమైన సంపత్తు. నిజానికి మానవుని ఉచ్ఛ్వాస, నిశ్వాసములుకూడను ఒక సంపత్తే! మానవునియొక్క అంగముల చైతన్యముకూడ ఒక సంపత్తే! మానవుని దృష్టికూడను సంపత్తే! మాటలు కూడను సంపత్తే! ఇవన్నీ ఐశ్వర్య స్వరూపములు కనుకనే అతనికి ఈశ్వరుడు అని పేరు పెట్టారు. సకలైశ్వర్య స్వరూపుడే ఈశ్వరుడు. ఈశ్వరుడు సర్వత్రా వుంటున్నాడనే సత్యమును మనము గుర్తించాలి. జ్ఞానశక్తి అదియే సరస్వతి. ఈ సరస్వతి ఎక్కడ వున్నది? బ్రహ్మపత్ని అని మనము అనుకుంటున్నాము. ఈ బ్రహ్మ ఎక్కడ వున్నాడు? సత్త్వరజోతమోగుణములయొక్క స్వరూపములే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. వీరిని శరీరధారులుగా ఇంతవరకు యెవరూ, ఎప్పుడూ చూడలేదు. ప్రకృతి, త్రిగుణాత్మకమైన స్వరూపము. దానినే త్రిమూర్తి స్వరూపము అన్నారు.

**శబ్ద బ్రహ్మమయీ చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి**
**నిత్యానందమయి పరాత్పరమయి మాయామయి శ్రీమయి**

ఇట్టి అష్టైశ్వర్య స్వరూపముతో కూడిన శక్తి ఈ ప్రకృతియొక్క స్వరూపము. ఈమె అన్ని విద్యలను నేర్పుతున్నది. ఈ సరస్వతి వాహనమేమిటని విచారించినప్పుడు, యిది 'హంస వాహనము' అంటారు. హంస అనగా ఒక ప్రత్యేకమైన పక్షి అని మనము భావిస్తున్నాము. సరస్వతి వాక్ స్వరూపిణి. ఈ వాక్కే సరస్వతి. ఇదే వేద స్వరూపము. ఈ వేదస్వరూపమైన వాక్కు మననుంచి వచ్చే సమయములో ఉచ్ఛ్వాస, నిశ్వాసములు ఆధారము చేసుకొని వస్తుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసములు లేక మాటను వుచ్చరించటానికి వీలుకాదు. కనుక, 'ఉచ్ఛ్వాస నిశ్వాసములే సోహం' అనేదే హంసగ రూపొందింపచేసుకొని ఈ సోహం అనే హంసయే వాక్ అనే సరస్వతి మననుండి వెలువడుతున్నాది. కనుక, సరస్వతి ఎక్కడనో లేదు. మన ఉచ్ఛ్వాస, నిశ్వాసములోనే వుంది, సరస్వతి. కనుక, దుర్గా, లక్ష్మి, సరస్వతులు దేహములో అంతర్భూతముగా వుంటున్నాయి. అగమ్యగోచరంగా వుంటున్నాయి. ఆ శక్తియే మనలో లేకపోతే మనము చూడలేము, వినలేము, మాట్లాడలేము, నడవలేము,

srisathyasaivachanamrutam

చేయలేము. మన తల్లి మనకు యే విధముగా విద్యలను గరపుతూ వున్నదో అదేవిధముగానే ఈ దేహములో ఉండే సరస్వతికూడను మనకు అన్ని విద్యలను అభ్యసింపచేస్తున్నది. ముగ్గురు తల్లుల బిడ్డయే మానవుడు. ఈ ముగ్గురు తల్లులు ప్రత్యేకముగా లేరు. మనయందే వుంటున్నారు. గుప్తంగా, ఆవ్యక్తంగా మనలో వున్న ఈ ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియా శక్తులను వ్యక్తీకరింపచేసినప్పుడే మనము సరైన వ్యక్తులుగా తయారౌతాము.

**తల్లిదండ్రులనే ప్రసన్నులను గావించుకోలేనివారు భగవంతుని యేరీతిగా ప్రసన్నులను గావించుకోగలరు?**

ప్రతి తల్లీ తన బిడ్డలకు నడకను చక్కగా చేయిపట్టి నేర్పుతున్నది. ఏ విధముగా ఆహారము తీసుకోవాలి, అనేది నేర్పుతున్నాది. మాటలు నేర్పుతున్నాది, తల్లి. బిడ్డ మాట్లాడే అమ్మ, అప్ప అనే మొదటి మాటలు తల్లియే నేర్పుతున్నాది. మాటలు నేర్పునది తల్లి, నడకను నేర్పునది తల్లి, ఆహారము భుజించటము నేర్పునది తల్లి, అన్ని విద్యలు నేర్పునది తల్లి. అందువల్లనే వేమనకూడను చిన్న పదములతో చెప్పాడు:

**తల్లి తండ్రి మీద దయలేని పుత్రుండు**
**పుట్టనేల వాడు గిట్టనేల**
**పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా**

మన తల్లితండ్రులనే మనము ఈశ్వరపార్వతులుగా విశ్వసించాలి. వారిని సేవించాలి. వారినే ప్రసన్నులను గావించలేనివారము యింక భగవంతుని యేరీతిగా ప్రసన్నులను గావించగలము? కనుక, మనము ఈనాడు నేర్చుకోవలసినది ప్రాకృతమైన నిత్యజీవితములో సత్యమార్గమును అవలంబించాలి. ఆదర్శ మార్గమును నిరూపించాలి. ఇవన్నీ కేవలము ఒక్క మాతృప్రేమలోనే ఆవిర్భవిస్తున్నాయి. తల్లిపైన బిడ్డకు, బిడ్డపైన తల్లికి అన్యోన్యత, అనురాగము వుండినప్పుడే దైవశక్తి అనేది ఆవిర్భవిస్తుంది. రెండు చేతులు కలిపి రుద్దినప్పుడు యేవిధముగా అందులో వేడి ఆవిర్భవిస్తుందో అదే విధముగా దైవశక్తి మనలో ఆవిర్భవిస్తుంది. అదే మన కరెంటు. అదే మన జ్యోతి. అదే మన భావము.

**దేశభక్తి, మాతృభక్తి లేకపోతే మనము మానవులమే కాము**

sri sathyasai vachanamrutam

మీకు రామాయణమునందు చక్కని ఆదర్శము ఒకటి వుంది. సీత, వాల్మీకి ఆశ్రమములో వుంటున్నది. నిరంతరము రామచింతనే చేస్తుంది. తన బిడ్డలైన లవకుశులు తల్లియొక్క ఆజ్ఞను శిరసావహించి తల్లి వడిలోపలనే సర్వ విద్యలను అభ్యసిస్తున్నారు. ప్రతి విషయమందు తల్లిని అండగా నిల్పుకొని, తల్లిని సంతోషపెట్టే భావముచేత వారు నిత్యజీవితము గడుపుతున్నారు. గురువుదగ్గర నేర్చిన విద్యలన్నికూడను ఆమెకు అప్పచెప్పేవారు. తల్లికూడను వారికి యెన్నో గుణపాఠములను నేర్పేది. కట్టకడపటికి శ్రీరామచంద్రుడు వారితో యుద్ధము చేయటానికి వచ్చినప్పుడు లవకుశులు తల్లినే స్మరించారు. తల్లిని స్మరించి అస్త్రము వేశారు. శ్రీ రామచంద్రుడు మూర్ఛచెందాడు. ఈ విధంగా మాతృమూర్తి ప్రభావము జగత్వ్యాప్తి గావించింది. కనుక, మాతృభక్తియందుండిన పవిత్రశక్తిని దివ్యత్వాన్ని గుర్తించుకోటానికి మనము ప్రయత్నించాలి. మాతృశక్తిని అట్టిది యిట్టిది, అంతది యింతది, అని యెవ్వరూకూడను నిర్ణయించటానికి సాధ్యము కాదు. మనము జన్మించిన దేశము, కనిపెంచిన తల్లిని రెండు నేత్రములుగా విశ్వసించి జననిని జన్మభూమిని మనము సేవించటానికి తగిన శ్రద్ధను అభివృద్ధి గావించుకోవాలి. ఈ దేశభక్తి, మాతృభక్తి లేకపోతే మనము మానవులమే కాము. దేశమాతను, దేహమాతను రెండు నేత్రములుగా భావించినప్పుడు యిది సరైన భక్తి ప్రపత్తులుగా రూపొందుతుంది. కేవలము భక్తి భక్తి అని చెప్పి ఏదో కొన్ని సాధనలు చేసినంత మాత్రమున యిది భక్తిగా రూపొందదు.

**పంచభూతములు లక్ష్మీ స్వరూపములే!**

మన దేహమునందున్న మాతృశక్తిని దుర్గస్వరూపిణిగా విశ్వసించాలి. దీనిని మనము వృధా చేయకూడదు. మన చూపులు చల్లని చూపులుగా ఉండాలి. మన మాటలు పవిత్రమైనవిగా, యితరులను ఆనందపెట్టే మాటలుగా ఉండాలి. మన తలంపులలోకూడను అనేక విధములైన శక్తి వ్యర్థమవుతున్నది. ఈ శక్తిని మనము వ్యర్థము గావించకుండా వుండే నిమిత్తమై, సార్థకము గావించుకునే నిమిత్తమై ఈ నవరాత్రి పూజలను ప్రారంభించాము. ఇందులో ప్రధానమైన ప్రార్థన "ఓ తల్లీ! నా శరీరమునందు సర్వశక్తి స్వరూపిణిగా వుండిన ఓ దుర్గా! నా శక్తులను ప్రవేశపెట్టుము"ని ప్రార్థించాలి. ఇంక, మనము తినే ఆహారము. ఇదంతా లక్ష్మీస్వరూపమే!

sri sathyasai vahamrutam

మనము ఒక్క మెతుకుకూడను వ్యర్థము చేయకూడదు. మనకు యెంత అవసరమో అంత భుజించాలి. జలమునుకూడ మనకు ఎంత అవసరమో అంతనే వినియోగించుకోవాలి. Tapలో కావలసినంత water వస్తున్నాది కదా అని యిష్టము వచ్చినట్లుగా మనము వినియోగించరాదు. ఈ పంచభూతములు లక్ష్మీస్వరూపములే! శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములైదు మనము దుర్వినియోగము చేయరాదు. ఎవరితో మనము మాట్లాడాలని భావిస్తున్నామో వారు, నీవు మాత్రమే వినాలిగాని మరొకరు వినకుండా వుండేరీతిగా మృదు, మధురంగా వాడాలి. కొంతమంది రూముల్లో మాట్లాడుతుంటే బజారులోకి వినిపిస్తూ వుంటుంది. అలా చేసినప్పుడు శబ్దాన్ని మనము దుర్వినియోగపరచినవారమవుతాము. కనుక, ఈ లక్ష్మీ స్వరూపిణియైన సర్వశక్తులు మనము దుర్వినియోగము చేయకుండా చూచుకోవాలి.

**మనలో ఉన్న దివ్య శక్తులను వ్యర్థము చేసినప్పుడు దైవశక్తిని వ్యర్థము గావించినట్లే!**

ఇక, చదువులు. ఈ చదువులు మనము సార్థకము గావించుకుంటున్నామా?

**వేదవేదాంగములు వల్లెవేసియున్న**
**గద్యపద్యంబులను కూర్పగలిగియున్న**
**చిత్తశుద్ధియె లేకున్న చెడును నరుడు**

ఎన్ని గ్రంథములు చదివి ప్రయోజనమేమిటి? ఎన్ని వేదాంతసూత్రములు వుచ్చరించి ప్రయోజనము యేమిటి? అందులో ఒక్కటైనా మనము ఆచరిస్తున్నామా? ఆచరణలేని విద్య కేవలము అవిద్యగానే రూపొందుతుంది. తెలుసుకున్న విషయాన్ని మనము ఆచరణలో పెట్టాలి. దీనిని పురస్కరించుకొనియే ceiling on desiresను మన సాయిసంస్థలలో ప్రారంభించాము. Do not waste food, food is God. ఆ food వలనే మన head; head వలనే God తత్వాన్ని మనము అర్థము చేసుకోగలుగుతున్నాము. ఒకరోజు food లేకపోతే head పని చేయదు. ఒక రెండు మూడు దినాలు అదేవిధముగా ఉంటే మన జ్ఞాపకశక్తి నశించిపోతుండాది. మన headను నిలబెట్టేది food. ఈ headను సత్రమమైన మార్గములోకి చేర్చేదెవరు? అతనే God. కనుక, donot waste food. ఇంక రెండవది donot waste money. ధనము లక్ష్మీస్వరూపము. Misuse of money is evil అన్నారు. ఇంక, కాలము సాక్షాత్తూ భగవత్

srisathyasaivacjhanamrutam

స్వరూపమే! కాలాయనమః, కాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః, కాలాతీతాయనమః, కాలస్వరూపాయనమః, కాలనిర్మితాయనమః అంతా కాలమే! Don't waste time, time waste is life waste. మన జీవితము వ్యర్థమైపోతుంది. చెడ్డ చూపులు, చెడ్డ మాటలు, చెడ్డ వినికిడి, చెడ్డ తలంపులు, చెడ్డ పనులు వీటియందే మనశక్తినంతా ధారపోసుకుంటున్నాము. నిజానికి ఈ శక్తులన్నీ దైవస్వరూపములే! వీటిని వ్యర్థము గావించుకున్నప్పుడు, దైవశక్తిని వ్యర్థము గావించినట్లే! అప్పుడు మన జీవితమే వ్యర్థమై పోతుంది.

**దివ్యశక్తులను సద్వినియోగము చేసుకున్నప్పుడు దివ్యత్వము దర్శించగలరు**

కనుక, వీటిని సార్థకము గావించుకొనే నిమిత్తమై మంచిని ఆచరించాలి. ఆచరించినదాన్ని అనుభవించాలి. అనుభవించినదానిని పెంచుకోవాలి. 'యోగః చిత్తవృత్తి నిరోధకః.' భారతదేశమందు మహనీయులైన ఋషులందరు ఈ విధమైన సక్రమమైన మార్గములో తమ శక్తులనంతా సద్వినియోగము చేసుకోటంచేతనే దైవత్వమును దర్శించగలిగారు. వారు తెలుసుకున్నది జగత్తునకంతా చాటారు. ఏమని? 'ఆ భగవంతుని, మహాతేజస్వరూపుడైన ఆ మహాపురుషుని మేము తెలుసుకున్నాము', అని చాటారు. ఎక్కడ తెలుసుకున్నారు? తమస్సు అనే అజ్ఞానముయొక్క ఆవలనున్న మహాపురుషుణ్ణి తెలుసుకున్నామన్నారు. మనలో ఈనాడంతా తమస్సే! ఈ తమస్సును అధిగమించినప్పుడే తపస్సుగా మారిపోతుంది. నేను, నాది అనే అజ్ఞానమునుండి దూరమై 'అంతా నేనే' అనే సత్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇదే బైబిలునందు జీసస్ అనేక విధములుగా చాటుతూ వచ్చాడు. కొంతకాలము సాధన చేశాడు. I am the messenger of God అన్నాడు. అనగా నేను భగవంతుని దూతను అన్నాడు. భగవంతుని చేతిలో తానొక పనిముట్టు, అని భావిస్తూ వచ్చాడు. క్రమక్రమేణా తనలో వుండిన శక్తినంతా సద్వినియోగపరచుకోటంచేత, కొంత కాలమైన తరువాత I am the son of God అన్నాడు. నేను ఆ భగవంతుని బిడ్డను అనే సత్యాన్ని గుర్తించుకున్నాడు. Son of God అంటే తండ్రి, కొడుకు. తండ్రికి, కొడుక్కు కొంత సన్నిహిత సంబంధము చేరిపోతుంది. కానీ sonగా వుండినంతవరకు తండ్రి ఆజ్ఞ శిరసావహించాలి కదా! మేము యిద్దరము ఒక్కటిగా అయ్యేది యేమార్గము అని విచారణ చేస్తూ వచ్చాడు. పన్నెండు సంవత్సరములు ఎడారులలో

srisathyasaivachanamrutam

తిరిగాడు. కట్టకడపటికి I and my father are one అన్నాడు. ఏకత్వమైన దైవములో ప్రవేశించాడు. అప్పుడే Holy ghost. మహమ్మదీయులుకూడను అదేరీతిగా చెప్తూ వచ్చారు. "నేను భగవంతునియొక్క శక్తిలో ఒక అణువుగా వుంటున్నాను. నేను అతని తేజస్సులో జీవిస్తున్నానుగాని నేను స్వతస్సిద్ధముగా లేను" అని భావించారు. కనుకనే వారు I am in the light అన్నారు. కొంతకాలము తరువాత "నేను ఈ జ్యోతిలో వుంటున్నాను కాని ఈ జ్యోతిలో వుండటానికి నాలోకూడను జ్యోతి వుండాలి కదా", అని ఒక విధమైన విచారణ ప్రారంభమైంది. ప్రోఫెట్ మహమ్మద్ దీనియొక్క తత్త్వాన్ని చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాడు. కొంతకాలము జరిగిన తరువాత the light is in me అనే సత్యాన్ని గుర్తించాడు. తనలో ఆ లైటు, తాను ఆ లైటులో ఈ రెండింటియందు 'నేను దేవునిలో, దేవుడు నాలో' అనే సమత్వము చేర్చుకుంటూ రావటంవల్ల I am the light అని చెప్పాడు. ఈ విధంగా ప్రతి మతముకూడను తమయొక్క గమ్యాన్ని చేరుకునే నిమిత్తమై మార్గములు వేరువేరు అయినప్పటికిని గమ్యము ఒక్కటే అనే సత్యాన్ని నిరూపిస్తూ వచ్చాయి. కానీ, ఈనాటి మానవ హృదయములు చాలా సంకుచితమైనవిగా వుండటంచేతను, స్వార్థ, స్వప్రయోజనములతో నిండిపోవటంచేతను, మత కలహములు పెరిగిపోయి భగవంతుని ఒక Party leaderగా భావించుకోటానికి పూనుకుంటూ వచ్చారు. భగవంతునికి సంపూర్ణ శరణాగతుడైనవానికే నిజమైన భగవత్ తత్త్వము అర్థమవుతుంది.

ప్రేమస్వరూపులారా! భగవంతుడు మనయందే వుంటున్నాడు. సమస్త శక్తులు మనయందే వుంటున్నాయి. సమస్త తేజస్సు మనయందే వుంటున్నది. ఇది కేవలము మానవ ఆకారమేగాని దివ్యమైన స్వరూపము. ఇది యిహలోకము కాదు. ఇది జీవలోకము కాదు. ఇది దేవలోకమనే సత్యాన్ని మీరు గుర్తించి వర్తించండి. అప్పుడే మీరు సత్యమును తెలుసుకున్నవారౌతారు. మీరే సత్యస్వరూపులౌతారు. ఈ రెండింటిని సమన్వయము గావించేది ప్రేమ ఒక్కటే. ప్రేమను పెంచుకోండి. పెంచుకొని పదిమందికి పంచుకోండి.

**(తేదీ. 15-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam